ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025 5 అనంతపురం





వాడిన పత్తి పంట



పత్తి పంటను తొలగిస్తున్న రైతు

హంద్రీనీవా కాలువ వెడల్పు ఆగినట్టే ..!

◆ 6300 క్యూసెక్కుల ప్రవాహ వెడల్పు పనులు రద్దు

◆ భైరవానితిప్ప ఆధునీకరణ అటకెక్కినట్టే ..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం 6300 క్యూసెక్కుల పెంపుదలకు చేపట్టిన పనులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పుడు జరుగుతున్న 3850 క్యూసెక్కులతోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా మొదటి దశ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం చేసింది. ఈ మేరకు టెండర్లు కూడా ఆహ్వానించి పనులను అప్పగించింది. కాని ఆ పనులు ప్రారంభమవలేదు. ఇప్పుడు వీటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా టెండర్లు పిలిచి ప్రారంభం కాని పనులు, 25 శాతం కంటే తక్కువ పని జరిగిన వాటిని రద్దు చేసింది. రాష్ట్రంలో రద్దయిన 71 పనుల్లో అనంతపురం జిల్లాకు సంబంధించి మూడు పనులున్నాయి. ఇందులో రెండు హంద్రీనీవాకు ప్రవాహ సామర్థ్యం పెంపుదలకు సంబంధించినవి ఉండగా, ఒకటి బిటిపి అభివృద్ధికి సంబంధించి ఉన్నాయి.

కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో హంద్రీనీవా ప్రాజెక్టును చేపట్టారు. దీని కింద ఆరున్నర లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు 40 లక్షల మందికి తాగునీటి వసతి కల్పించాలన్నది లక్ష్యం. దీని అదనంగా అనేక ప్రాజెక్టులు తోడవడంతో హంద్రీనీవా నీటి అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వస్తున్న 2800 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఇక్కడి నీటి సమస్యలను పరిష్కరించలేమని డిమాండ్ రావడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి హంద్రీనీవా మొదటి దశ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం చేసింది. 2021లో టెండర్లు పిలిచి రెండు ప్యాకేజీల్లో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అందులో 4.86 కిలోమీటరు నుంచి 88వ కిలోమీటరు వరకు కాలువ వెడల్పు పనులను మెఘా ఇంజినీరింగు సంస్థకు రూ.2484 కోట్ల విలువైన పనులను అప్పగించారు. ఆ తరువాత 88వ కిలోమీటరు నుంచి 216వ కిలోమీటరు వరకు రూ.2163 కోట్ల విలువైన పనులను డిఎస్ఆర్, విపిఆర్ జాయింట్ వెంచర్ సంస్థకు అప్పగించారు. ఇది కూడా 2021లోనే అప్పగిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ఆరంభమవలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవహ సామర్థ్యంతో 3850 క్యూసెక్కులకే కుదించి వెడల్పు పనులను చేపట్టింది. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన 6300 క్యూసెక్కుల వెడల్పు పనులను రద్దు చేస్తూ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇక హంద్రీనీవా ప్రవహ సామర్థ్యం ఇక 3850తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చే అవకాశముంది.





బిటిపి అభివృద్ధికి మంగళమే

భైరవానితిప్ప ప్రాజెక్టు మట్టి కట్టతోపాటు, కుడి కాలువకు నీటిని విడుదల చేసే ప్రాంతం దెబ్బతింది. దీని మరమ్మతుల కోసమని రూ.4.61 కోట్ల నిధులు 2022లో మంజూరయ్యాయి. ఇవి టెండరు ప్రక్రియ వరకు కూడా పోవడంతో ఈ పనులనూ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటికే బలహీనంగానున్న బిటిపి ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకునే అవకాశాలు కనిపించడం లేదు.

రైతు కష్టం ఆవిరి..!

◆ వర్షం రాకపోవడంతో ఎండిన పత్తి పంట ◆ తొలగించిన రైతులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

జిల్లాలో వర్షం మొహం చాటేసిన నేపథ్యంలో మండల పరిధిలో పత్తిపంట సాగు చేసిన రైతులు తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మండలంలోని అవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో నెలరోజుల క్రితం సాగుచేసిన పత్తిపంటలకు వర్షం రాకపోవడంతో మొక్కల ఎదుగుదల ఆగిపోయింది. దీంతో వర్షం వచ్చినా మళ్లీ ఎదుగుతాయనే ఆశలు రైతన్నల్లో లేక నష్టమైనా తొలగించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి దాదాపు ఏడెకరాల్లో సాగు చేసిన పత్తిపంటను శుక్రవారం ట్రాక్టర్ సాయంతో తొలగించారు. పంటకు సుమారు రూ.50వేలు దాకా పెట్టుబడి పెట్టగా ఫలితం లేకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ మాసంలో పత్తిపంటను సాగుచేయగా నెలరోజులు అవుతున్నా వర్షాలు కురవకపోవడంతో మొక్కల ఎదుగుదల పూర్తిగా తగ్గిపోయిందన్నారు. చేసేది లేక తొలగించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సాగు చేసేందుకు తెచ్చుకున్న విత్తనాలు వృథాగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

హెచ్ఎల్‌సికి నీరు విడుదల

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని తుంగభద్ర ఎగువ కాలువ ఆంధ్ర, కర్నాటక సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద అడ్డు వేసిన షెట్టర్లను హెచ్ఎల్‌సి అధికారులు శుక్రవారం ఉదయం 10 గంటలకు తొలగించి ఆంధ్రకు నీటిని విడుదల చేశారు. కాలువ మరమ్మతులు, నీటి విడుదలలో జాప్యంపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కాలువకు నీరు విడుదల చేయడంపై రైతులు హర్ష వ్యక్తం చేశారు. తుంగభద్ర నీటిని గత పది రోజులుగా కర్నాటక రైతులు వినియోగించుకుంటున్నారని, ఆంధ్రాలో మాత్రం ఈ రోజు నుంచి నీరు విడుదల చేశారు కావున నేటి నుంచి లెక్క కట్టి 22 టిఎంసిలు తప్పకుండా రాబట్టుకోవాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

కామ్రేడ్ వీరన్న బాటలో పయనిద్దాం

వర్ధంతి సభలో వక్తలు



వీరన్న స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

సిపిఎం నాయకులు కామ్రేడ్ వీరన్న బాటలో పయనిద్దామని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. వీరన్న వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలం కిష్టిపాడు గ్రామంలో ఉన్న స్థూపం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, రైతుసంఘం మండల అధ్యక్షులు మద్దిలేటి మాట్లాడుతూ వీరన్న తమ ఉద్యమ ప్రస్థానంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలు, దళితుల అగ్రవర్ణాలు చూపిస్తున్న కుల వివక్షపై అనేక ఉద్యమాలు చేశారన్నారు. ముఖ్యంగా దళితులను ఆలయ ప్రవేశం చేయించడంలో, శ్మశాన వాటికలు ఏర్పాటు చేసే విషయంలో, దాడులను అరికట్టడంతో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. వీరన్న భార్య అరుణమ్మ మాట్లాడుతూ వీరన్న తన జీవితం మొత్తం దళిత ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారన్నారు. భవిష్యత్తులో ఆయన ఆశయాల సాధన కోసం కుటుంబ సభ్యులుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దస్తగిరి, రైతుసంఘం మండల అధ్యక్షులు మద్దిలేటి, చేనేత సంఘం మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి ముహమ్మద్ రఫీ, చేనేత సంఘం నాయకులు హరిగోపాల్, గొడ్డలి రాయుడు, వీరన్న కుమారులు సూర్యప్రకాష్, కుటుంబ సభ్యులు, పెద్ద సుంకన్న, పెద్ద శ్రీరాములు, చిన్న శ్రీరాములు, గోపాల్, రామాంజనేయులు, కుమార్, సుజాత, ఈశ్వరమ్మ, బేబీ పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించం



కళ్యాణదుర్గంలో కార్మికుల నిరసన



రాయదుర్గంలో మానవహారం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించేంత వరకూ సమ్మె విరమించబోమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున స్పష్టం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం కార్మికులు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి వినాయక కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి స్వచ్ఛ భారత్ అవార్డు తీసుకుంటున్న అధికార యంత్రాంగం ఆ అవార్డు రావటానికి కారణమైన కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులను బెదిరించి పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే కలిసొచ్చే సంఘాలను కలుపుకొని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంజినీరింగ్ విభా గం కన్వీనర్ బి.ముత్యాలరావు, ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ కార్మికుల మధ్య వివాదాలు సృష్టించి జీఓల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఇకనైనా కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ నిర్వ హించి సమస్యలు పరిష్కరించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, మల్లేష్, తిప్పేరుద్ర, రాము, మైలారి, నరసింహులు, రమేష్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి వన్నూరుస్వామి మాట్లాడుతూ కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నా నిబంధనల పేరుతో సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు శివకుమార్, నటరాజ్, దుర్గమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు వైసిపి మద్దతు

గుత్తి :తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు వైసిపి మద్దతు తెలిపింది. ఇందులో భాగంగా 6వ రోజు శుక్రవారం కార్యాలయం వద్ద కార్మికులు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ధర్నాకు మద్దతు తెలిపి శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు యాదవ్, నాయకులు ఎం.రంగస్వామి, డి.షఫీ మాట్లాడుతూకార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కౌన్సిలర్లు వి.వరదరాజులు, ఎన్.ఫారూఖ్, కెవి.మణ, నరేష్, నాయకులు బి.రమేష్‌రెడ్డి, రామనారాయణరెడ్డి, వెల్డింగ్ రవూఫ్, మల్లికార్జున, ఊటకల్లు సుధాకర్, సర్పంచి ఆంజనేయులు, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్, ఉపాధ్యక్షుడు ఎస్ ఎమురళి, సహాయ కార్యదర్శులు నరసింహ, ఆది, కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, కె.మహేష్, కె.బాలరంగన్న పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ కుమార్ సూచించారు. పట్టణంలోని ఎఎస్‌డబ్ల్యు కార్యాలయంలో శుక్రవారం వసతి గృహాల వార్డెన్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, కావున ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కిటికీలకు మెష్ వేయించాలని, దోమతెరలు వాడేలా చర్యలు తీసుకోవాలని, వసతిగృహం పరిసరాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థులు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో వార్డెన్లు నాగరాజు, సురాంజనేయులు, జయలక్ష్మి, ఓబులమ్మ, రాధ, ఆరోగ్య కార్యకర్తలు గంగరాజు, జాన్సన్, శుభాషిణి పాల్గొన్నారు.



ఢిల్లీ ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ చేయాల్సిందే

ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయాలని, ఆర్‌డిటి సంస్థ ఏఫ్‌సిఆర్ఏను రెన్యూవల్ చేయాల్సిందే అని డివైఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు రహీం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రామన్న, అనంతపురం జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా నుంచి హాజరై కసాపురం రమేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలన్నారు. అనంతపురం జిల్లాకు ఎనలేని సేవలు అందిస్తున్న ఆర్‌డిటి సంస్థ సేవా కార్యక్రమాల కోసం ఉపయోగిస్తున్న ఎఫ్‌సిఆర్ఏ ఖాతాను రెన్యూవల్ చేయాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేయాలన్నారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో వలసలు నివారించి ఉపాధి కల్పించే పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, అశోక్, వంశీ, రమణ, రంగా తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ఉల్లాసంగా విధులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఐ

పోలీస్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఉల్లాసంగా విధులు నిర్వహించడం సాధ్యమవుతుందని ప్రముఖులు తెలిపారు. పట్టణంలోని ఆర్‌డిటి ఎఎఫ్ ఎకాలజీ కార్యాలయంలో శుక్రవారం పోలీసు శాఖలో ఉద్యోగుల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సిఐలు, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు సుమారు 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సిఐలు యువరాజ్, వంశీకృష్ణ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

బీ.టెక్, ఎంబిబిఎస్, బి-ఫార్మసీ కోర్సులు చదువుతున్న నియోజకవర్గంలోని ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు వివేకానంద ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలని శారదాదేవి ట్రస్ట్ నిర్వాహకులు అర్చనానంద తెలిపారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఆధ్యాత్మ ప్రచార సేవా ఆశ్రమంలో ఆగష్టు 18 నుంచి 24వ తేదీ వరకూ దరఖాస్తులు పొందవచ్చన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్‌తో పాటు ప్రస్తుతం చదువుతున్న కోర్సు మార్కుల జాబితాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి బలవంతపు భూసేకరణను తక్షణమే ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీ నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సుకు రైతులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో రాయుడు, ఎన్.నాగరాజు, మధు, తదితరులు రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేసి పంపిణీ చేశారు. సోలార్, గ్రీన్‌ఎనర్జీ, ఎస్ఈజెడ్(సెజ్), జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, గ్యాస్ పైప్‌లైన్లు, రైల్వే లైన్లు, సిమెంట్ పరిశ్రమల పేరుతో రైతుల వ్యవసాయ భూములను బలవంతంగా సేకరిస్తుందన్నారు. రైతుల అనుమతి లేకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా లక్షల ఎకరాల రైతులు, ప్రభుత్వ భూములను ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం సరికాదన్నారు. కార్యక్రమలో రైతులు మధు, శంకర్, వెంకటేశులు, దివాకర్, మంజు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాలకు నూతన ఎఎన్ఎంలు


ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పలు సచివాలయాలకు నూతనంగా ఎఎన్ఎంలను నియమించినట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం ఆయన నూతన ఎఎన్ఎంల ఆర్డర్ కాపీని తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లలపల్లి సచివాలయానికి ఉమ, బైరసముద్రం- సన్నలింగమ్మ, ఎరడికెర-రోజా, వేపులపర్తి-2కు సువర్ణమ్మ బదిలీపై వచ్చారన్నారు. వైద్యాధికారి వారి జాయినింగ్ రిపోర్ట్ తీసుకొని బాధ్యతలు అప్పగించారు. పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కాగా వెస్ట్ కోడిపల్లి, కన్నేపల్లి, బ్రహ్మసముద్రం, పాలవెంకటాపురం సచివాలయాలకు త్వరలోనే ప్రభుత్వం మంజూరు జాబితాను ప్రకటించనుంద న్నారు.

ప్రభుత్వ ఖాజీకు సన్మానం

ప్రజాశక్తి-కణేకల్లు

మండల ప్రభుత్వ ఖాజీగా సయ్యద్ మహమ్మద్ ఖాజిం బాషా ఖాద్రీని ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన గత బుధవారం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ నుంచి నియామకపత్రాలు అందుకున్నారు. నూతన ఖాజీని శుక్రవారం జామియా మజీద్‌లో కణేకల్లు కబరస్తాన్ కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నేమ్‌తుల్లా ఖాద్రి కమిటీ అధ్యక్షులు బషీర్, షేక్ గౌస్ పీర్, జావీద్ బాషా, గౌస్ సాబ్, షాకీర్, మహబూబ్ పీరా, జమీల్ బాషా, కాకిడి శర్మాస్ పాల్గొన్నారు.



ఖాజీని అభినందిస్తున్న కబరస్తాన్ కమిటీ సభ్యులు

సొంత నిధులతో పాఠశాల భవనం పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే



విలేకరులతో మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని పాలవాయి గ్రామ ఉన్నత పాఠశాల భవనాన్ని సొంత నిధులతో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో పాలవాయి ఉన్నత పాఠశాల భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని ఆ గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్తి ఎస్టిమేట్ వేయించామని, ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్ఆర్‌సి ట్రస్ట్ ద్వారా రూ. 50 లక్షలు వెచ్చించి ఆ పాఠశాల భవన నిర్మాణాలను 3 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. అందుకు అవసరమైన నగదును మూడు రోజుల్లో పాఠశాల అకౌంట్‌కు జమ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా చాలా పాఠశాలల్లో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసి, మౌలిక సదుపాయలు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేతో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీరమేష్, టిడిపి నాయ కులు మోరేపల్లి మల్లికార్జున, డికె.రామాంజనేయులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 280 మందికి ఉద్యోగాలు

కళ్యాణదుర్గం టౌన్ : నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా నిరుద్యోగులు తరలివచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 20కి పైగా మల్టీ నేషనల్ కంపెనీలతో జాబ్‌మేలా నిర్వహిస్తున్నామన్నారు. చదువుకున్న యువతకే కాకుండా ఇతరులకు ఇతర మార్గాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 600 మంది ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోగా 280 మంది ఉద్యోగాలకు అర్హత సాధించడంతో ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఎమ్మెల్యే అభినందించారు.

మందుబాబుల అడ్డాగా పాఠశాల మైదానం

ఎక్కడ చూసినా మద్యం సీసాలు, గాజుపెంకులే..

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. మైదానంలో ఎటు చూసినా మందు సీసాలు, పగలగొట్టిన గాజుపెంకులే కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆటలు ఆడుకోవాలంటే ఆందోళన చెబుతున్నారు. ఆటస్థలానికి ఉన్న ప్రహరీ కూలిపోవడంతో మందుబాబులు ఎక్కడపడితే అక్కడ చొరబడి మద్యం తాగుతున్నారు. దీనికితోడు కొందరు మూత్రవిసర్జన కూడా చేస్తున్నారు. దీంతో ప్రహరీకి వెళ్లాలంటేనే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదానానికి ప్రహరీ ఏర్పాటు చేసి మందుబాబులకు అడ్డుకట్ట వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



క్రీడా మైదానంలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి
www.prajasakti.com

మంత్రికి వినతుల వెల్లువ



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న చిరుద్యోగులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లయ్ శాఖలో పని చేస్తున్న చిరుద్యోగులు తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, కనటెన్‌జెన్సీ, డైలీవేజ్ పద్ధతిని పని చేస్తున్న చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు ఆర్‌వి నాయుడు, పౌర సరఫరాల సంస్థ చిరుద్యోగుల సంఘం ఉద్యోగ సంఘాల నేతలు జాకీర్ హుసేసన్, ఈశ్వర్, వివేక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా 2025-16లో టిడిపి ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ ఉద్యోగ నోటిఫికేషన్ జిల్లా ఎంపిక కమిటీ ద్వారా చిరుద్యోగులుగా నియమింపబడ్డామన్నారు. గత వైసిపి ప్రభుత్వం చిరుద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పౌర సరఫరాల శాఖలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో ఉన్న చిరుద్యోగులకు పని భారం పెరిగిందన్నారు. కాని పనికి తగ్గ భద్రత గాని, వేతనం గాని అమలు కావడం లేదన్నారు. పరిశీలించి పౌర సరఫరాల శాఖ చిరుద్యోగులందరిని రెగ్యులరైజ్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి మీ సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పర్యటన వచ్చిన మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించడంతోపాటు సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులందరికీ ఒకే బేసిక్ పే నిర్ణయించాలని విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఇప్పటికే మీ ప్రమోషన్ ఫైళ్లపై సంతకం చేశామని, మిగతా విషయాలను ఈనెల 24న జరగబోయే క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జెఎసి నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, ముత్యాలు రాజు, వరప్రసాద్, మల్లికార్జున, శివశంకర్, రామకృష్ణ, మహేష్‌నాయక్, సిరాల చంద్ర, వీరనారప్ప, నారాయణస్వామి, వినయ్, నరేష్, రవీంద్రకుమార్ ఉన్నారు.

అహుడా పరిధిలో ల్యాండ్‌బ్యాంకు గుర్తించాలి

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంకును గుర్తించాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోనిఎన్‌ఐసి భవనంలో నగరపాలక సంస్థ, అహుడా, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ల్యాండ్ బ్యాంకుని ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. ఎంఐజీ లేఔట్లను అభివృద్ధి చేసి ప్రజలకు ప్లాట్లను కేటాయించాలన్నారు. మంచి భూములను నగరానికి దూరంగా కాకుండా దగ్గర్లో ఉండేవి చూడాలన్నారు. ఆయా లేఔట్స్‌లో రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. కళ్యాణదుర్గం పరిధిలోని ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి త్వరలో సచివాలయ ఉద్యోగులకు సంబంధించి గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కి ప్రమోషన్లను ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, కమిషనర్ బాలస్వామి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రామ్మోహన్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇఇ ఆదినారాయణ, నగరపాలక సంస్థ ఇఇ షాకిర్, టిడ్కో ఇఇ సుధారాణి పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

అనంతపురం సిటీ : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఉపాధి కార్యాలయంలో ఈనెల 21వతేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనా అధికారిణి ఎస్.పల్లవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి 18 నుంచి 50ఏళ్ల మధ్య వయసు ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్, ఫాన్, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకాలను తీసుకురావాలని కోరారు.

"ప్రభుత్వాలు.. పాలకులు మారుతున్నారు తప్పా ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. అభివృద్ధిపై పాలకులకు చిత్త శుద్ధి కొరవడింది. వ్యక్తి స్వార్థం.. వ్యక్తిగత ప్రయోజనమే రాజకీయాల్లో కన్పిస్తోంది. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి ఇలా అన్నింటిపై నిర్లక్ష్యం కారణంగా జిల్లా అభివృద్ధి ముందుకు సాగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. సమస్యలను ఎలుగెత్తి చాటుతూ, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా ఉన్న ప్రజాశక్తి లాంటి పత్రికలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది." అని పలువురు వ్యక్తలు పేర్కొన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం ఎన్జీవో హోంలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై పలువురు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం..!

- పాలకులకు కొరవడిన చిత్తశుద్ధి
- ప్రజా ఆధారిత రంగాలు నిర్వీర్యం
- విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులపై దృష్టి సారించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రజాశక్తి ఆధ్వర్యంలో సమావేశం

బనకచర్ల.. మోసపూరిత హామీ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం చెబుతున్న బనకచర్ల ప్రాజెక్టు ఓ మోసపూరిత హామీ. ఈ ప్రాజెక్టు 50 సంవత్సరాలైన పూర్తి కాదు. అలాంటిది త్వరితగతి పూర్తి చేసి రాయలసీమను సశ్యామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడం హాస్యాస్పదం. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు కేటాయించి శ్రీశైలం ప్రాజెక్ట్‌లో మిగులు జలాలను మళ్లిస్తే రాయలసీమకు ప్రతిఫలం ఉంటుంది. హంద్రీనీవా గొప్ప ప్రాజెక్టుగా ఉన్నా ఎకరాకు కూడా నీటిని వినియోగించని దుస్థితి ఉంది. సాగునీరు, వ్యవసాయంపై పాలకులు దృష్టి సారిస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యం అవుతుంది.

ఎస్ఎం.బాషా, సాగునీటి సాధన సమితి అధ్యక్షులు.

ప్రజా ఆధారిత రంగాలు అభివృద్ధి చేయాలి



ప్రజలు ఎక్కువ అధారపడే రంగాలను అభివృద్ధి చేయకుండా ఎలాంటి అభివృద్ధీ సాధ్యం కాదు. అది పాలకులకు తెలిసినా అటువైపు దృష్టి సారించరు. సాగుకు యోగ్యమైన 40 శాతం భూమికి నీరు అందిస్తే వ్యవసాయం వృద్ధి చెందుతుంది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే అంశంపై పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఏడాదికేడాది రైతుల ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. బనకచర్లకు వేల కోట్లు ఖర్చు పెట్టి నీరు అందిస్తామంటున్న పాలకులు తొలుత హంద్రీనీవా కాలువలు వెడల్పు చేస్తే జిల్లాకు మేలు జరుగుతుంది. ప్రత్యేక హోదా లేకుండా పరిశ్రమలు రావడం అసాధ్యం.

కెవి.రమణ,
అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు.

బనకచర్లతో లాభం కంటే నష్టమే ఎక్కువ



రాయలసీమ జిల్లాలకు 200 టిఎంసిల నీటిని తీసుకొచ్చే లక్ష్యంగా బనకచర్ల వంటి గొప్ప ప్రాజెక్ట్‌ను నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుండటం హాస్యస్పదంగా ఉంది. బనకచర్ల ప్రాజెక్టుతో లాభాల కంటే నష్టాలే అధికంగా ఉన్నాయన్న సత్యాన్ని పాలకులు గ్రహించాలి. బనకచర్ల విషయంలో ఢిల్లీ పెద్దలను భాగస్వామ్యం చేసి రెండు రాష్ట్రాల మధ్య తగాదాలను వారి చేతుల్లో పెట్టి చట్టబద్ధంగా మార్చే ప్రయత్నం చేశారు. కృష్ణా, గోదావరి జలాల మొత్తం వివాదాలు ఏమున్నాయో పరిశీలించడానికి నిపుణుల కమిటీ వేశారు. రెండు రాష్ట్రాలు సమస్యను కేంద్రం వద్దకు తీసుకెళ్లడం, కమిటీలు వేయడంతో అంటే ఢిల్లీ పెద్దలు అజమాయిషీలోకి వెళ్లడమే అన్న అంశాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గ్రహించలేక పోయారు. ఎన్నికల్లో లబ్ధి కోసం భవిష్యత్‌లో నిపుణుల కమిటీ తెలంగాణాకే మొగ్గుచూపే అవకాశం ఉంది. సీనియర్ ముఖ్యమంత్రిని అని చెప్పుకునే నారా చంద్రబాబు నాయుడుకు ఇది తెలియనట్లు వ్యవహరించడడం బాధాకరం.

వి.రాంభూపాల్; సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

తర'గతి' మారాలి



దేశాభివృద్ధి తరగతి గదుల్లోనే నిర్ణయించ బడుతుందని డాII సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారు. అయితే నేటి పాలకులు తరగతి గదుల గతిని మార్చే తీరిక లేక పరిపాలన సాగిస్తున్నారు. రాజకీయ పార్టీలకు విద్యా వ్యవస్థ పట్టని అంశంగా తయారైంది. నాణ్యమైన విద్య ప్రభుత్వ విద్యా రంగంలో అందిస్తే ప్రశ్నించే తత్వం పెరుగుతుందనే భావనతో ప్రభుత్వాలు కుట్రతో విద్యను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రయివేటు బడులు పుట్టుకొస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. విశ్వ విద్యాలయాల్లో బోధించే ప్రొఫెసర్ల నియామకాలు లేవు. పరిశోధన విద్యార్థులకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వ విద్యపై పట్ల ప్రభుత్వాల ఉదాసీన వైఖరి వీడి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి.

చంద్రశేఖర్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్.

హెచ్చుమీరిన అవినీతి



కంప్యూటర్ డాక్టరేట్‌లు వచ్చి అసలైన డాక్టరేట్‌లకు విలువ లేకుండా పోయింది. రూ.3 లక్షలు ఇస్తే డాక్టరేట్ వచ్చే దౌర్భాగ్య రోజులు రావడం సిగ్గుచేటు. సమాజంలో విద్యా, వైద్యం, మద్యం రంగాలను పాలకులు లాభసాటిగా మార్చుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేవు. ప్రయివేటు రంగంలో శ్రమ దోపిడీ జరుగుతోంది. న్యాయమైన పని చేయించు కునేందుకు కూడా లంచం ఇవ్వాల్సిన పరిస్థితులను పాలకులు, ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. నేటి పాలకులు విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తూ సమస్యల్లో ప్రజలను నెట్టివేస్తున్నారు. ప్రశ్నించే వారికి కులాన్ని అంటగట్టి విమర్శలకు దిగుతున్నారు. అభివృద్ధి కోసం ప్రజలందరూ ఐక్యంగా గొంతెత్తాల్సిన అవసరం ఉంది.

తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి,
మానవతా రక్తదాతల సంస్థ వ్యవస్థాపకులు.

కాలువల ఏర్పాటుతో ప్రయోజనం



దశాబ్దాలుగా అనంతపురం జిల్లా కరువుకు గురై వ్యవసాయ రంగం కుదేలైంది. ఉన్న సాగు వనరులు వినియోగించుకునేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో విఫలం చెందాయి. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధానంగా ఉన్నా కాలువలు లైనింగ్ చేయని దుస్థితి నెలకొంది. హెచ్ఎల్‌సి ఆయకట్టు నీరు వచ్చినా వినియోగించలేని పరిస్థితి ఉంది. ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి వస్తున్న నీటిని సక్రమంగా వినియోగించేలా కాలువలు నిర్మించాలి. అత్యధిక మంది వ్యవసాయ రంగంపైన ఆధారపడి జీవిస్తున్నారు. వారందరికీ ఉపాధి కల్పించడం కంటే గొప్ప అభివృద్ధి మరొకటి ఉండదు. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలి. వాటితో పాటి సహజ వనరులు లభించే ప్రాంతంలో వాటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. పాలకులు హామీలతో సరి పెట్టకుండా ఆచరణలో చేసి చూపించి ప్రజల ఆదరణ పొందాలి.

శివారెడ్డి,
పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి.

కరువులో ప్రథమ స్థానమే..!



ఉమ్మడి అనంతపురం జిల్లా నిత్యం కరువు కాటకాటకాలకు నిలయంగా మారింది. ఈ జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిఎస్‌టి రూపంలో పన్నులు చెల్లించడంలో ప్రథమ స్థానంలో ఉన్నా, అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంటూ కరువులో అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. జిల్లా ప్రజలు, వ్యాపారులు నిజాయితీగా పన్నులు చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ పన్నుల సొమ్మును ప్రజలకు ఉపయోగించడం లేదు. దీంతో అభివృద్ధి సామాన్యుల దరి చేయడం లేదు. ప్రభుత్వాలు పరిశ్రమలకు ప్రోత్సాహాలు అందించాలి. కోట్లాది మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి. వ్యవసాయం అభివృద్ధి చెందనంత వరకు జిల్లా అభివృద్ధి చెందలేదు.

రంగారెడ్డి, చాంబర్స్ ఆఫ్ కామర్స్ మెంబర్.

ఎపిఐఐసి భూముల్లో పరిశ్రమలు పెట్టాలి



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎపిఐఐసికి సంబంధించిన భూములు విస్తారంగా ఉన్నాయి. హిందూపురం, గుత్తి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి. ఇండ్రస్టియల్ కారిడార్‌లు ఏర్పాటు చేస్తామంటున్న పాలకులకు ఈ భూములు కనిపించనట్లు ఉన్నాయి. ప్రజలు చైతన్యం వంతులై పరిశ్రమల స్థాపన కోసం ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. మహిళలు కష్టాన్ని నేస్తంగా భావించి జీవిస్తున్న వారు 65 శాతం మంది ఉన్నారు. వ్యవసాయ రంగమైన, పారిశ్రామిక రంగమైన ఏ రంగంలోనైనా మహిళలు శ్రమిస్తున్నారు. ఉమెన్ సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపులు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

పద్మ నారాయణరెడ్డి,ఉమెన్స్ క్లబ్ కార్యదర్శి న్యాయవాది.

పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలి

పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి జిల్లా అవృద్ధికి తోడ్పాటు అందించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు. వ్యవసాయం, సాగునీరు, వైద్యం, ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి చేయకుండా హామీలతో కాలం వెల్లదీస్తే అనంత అభివృద్ధి ఎండమావిగానే ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రజాప్రతినిధులు రాజకీయాలు పక్కన బెట్టి జిల్లా అభివృద్ధికి పాటుబడాలి. ఈకార్యక్రమంలో మానవతా సలీమాలిక్, రచయిత రియాజుద్దీన్, రెడ్స్ వెంకటస్వామి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజామోహన్, ప్రజారోగ్య వేదిక శ్రీనివాసరావు, ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.

నార్పల వైద్యాధికారిణిగా యమీమభూషణ్



నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిణిగా యమీమభూషణ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశమై పలు విషయాలు చర్చించారు. స్థానిక సిబ్బంది సహకారంతో మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తానని తెలిపారు. కాగా స్థానిక ప్రాథమిక వైద్యశాలను జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఇబి దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గర్భిణులకు అందించే సేవలపై ఆరాతీశారు. అంతేగాకుండా నేరుగా గర్భిణులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలలో కాన్పుల గది, ల్యాబ్, మందులు ఇచ్చే గదులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ బాలాజీ, ఎంపిహెచ్ఇ ఎన్ ప్రమీల, సూపర్‌వైజర్ ఆక్కులప్ప, యునాని వైద్యులు రఫీ, ఉద్దీన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు

తాడిపత్రిలో వైసిపి విస్తృత స్థాయి సమావేశం

తాడిపత్రి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోడలు అర్చితారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, జెడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, తదితరులు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు, క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలలుగా సిఎం చంద్రబాబు చేస్తున్న మోసాలు, పోలీసులను అడ్డు పెట్టుకుని అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా సమావేశానికి హాజరు కావాల్సిన మాజీ ఎమ్మెల్యే, వైసిపి సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డిని శాంతి భద్రతల దృష్ట్యా తిమ్మంపల్లిలోని స్వగృహంలో గృహ నిర్బంధం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు సచివాలయం-4ను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 2023 నుంచి 2025 వరకూ రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులు, పిల్లల వైద్య సేవల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిపిఒ కిషోర్‌కుమార్, ఎంఐఎస్ విభాగం నుంచి జరీనా, డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి, సిహెచ్ఒ జుబేదా, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

వంకరాజుకాలువలో ఇంటింటి చెత్త సేకరణ

పామిడి : మండలంలోని వంకరాజు కాలువ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు పర్యవేక్షించారు. ఇందులో భాగంగా చెత్త సేకరణతోపాటు ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డు నిర్వహణ, మంచినీటి ట్యాంకులు, నీటి సరఫరా వంటివి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం ఏడు గంటలలోపు పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. తర్వాత కార్యదర్శి పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శికి షాకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి తేజోష్ణ, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అశ్వర్థమనాయుడు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఉద్రిక్త వాతావరణం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఓవైపు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారనే సమాచారం.. మరోవైపు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలోని మార్కెట్ యార్డులో షెడ్డు ఓపెనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్న నేపథ్యంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎందుకంటే పెద్దారెడ్డి కుటుంబ సభ్యులను తాడిపత్రిలోకి అనుమతించేది లేదని జెసి ప్రభాకర్‌రెడ్డి భీష్మించిన నేపథ్యంలో పెద్దారెడ్డి వస్తున్నారన్న వార్తల నేపథ్యంలో అటు తాడిపత్రిలోని పెద్దారెడ్డి నివాసం వద్ద, ఇటు జెసి నివాసం వద్ద భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. అయితే పెద్దారెడ్డిని యల్లనూరు మండలం తిమ్మంపల్లిలోనే గృహ నిర్బంధం చేశారు. దీనికితోడు షెడ్డు ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకోవాలని పోలీసులు ప్రభాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడంతో ఆయన విరమించుకున్నారు. దీంతో పోలీసులతోపాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్వీపర్లు, సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కింద విధులు నిర్వహిస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఆత్మారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 30ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ సంబంధించి కార్మికుల అకౌంట్లలో అతి తక్కువ అమౌంట్ జమ కావడం బాధాకరమన్నారు. దీనికితోడు 30 మందికి పిఎఫ్, ఎఎస్ఐ లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనికి తగ్గ వేతనం రూ.21వేలు ఇవ్వాలని, 15రోజులు సెలవులు కేటాయించాలని, మహిళలందరికీ డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని, పనిభారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు నల్లమ్మ, నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు శేఖర్, సంజీవులు, ఉమాదేవి, ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం తన ఛాంబర్‌లో నిర్వహించనున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సమావేశానికి స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు

నేరాలు ఘోరాలు

విద్యుత్ తీగలు తగిలి బేల్దారి మృతి

రాయదుర్గం : పట్టణంలోని కోట మారెమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై బేల్దారి మృతి చెందాడు. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు గ్రామానికి చెందిన కొలిమి ఇస్మాయిల్(35) తోటి బేల్దారులు, కూలీలతో కలిసి పట్టణంలోని కోట మారెమ్మ ఆలయ సమీపంలో గృహ నిర్మాణ పనులకు వచ్చారు. ఇస్మాయిల్ బేల్దారి పని చేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కింద పడ్డాడు. తోటి వారు గమనించి వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇస్మాయిల్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు అయిన ఇస్మాయిల్ మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

బుక్కరాయసముద్రం : యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బొమ్మలాటపల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి నార్పల మండలం పులుసులనూతల గ్రామానికి చెందిన మల్లికార్జున (21)గా గుర్తించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నార్పల : మండల పరిధిలోని దుగ్గం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీకుమారి, శివారెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకే రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు సంజీవరాయుడు, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, ఇందిరమ్మ, అంగన్వాడీ పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్స్‌ కోసం దరఖాస్తులు

అనంతపురం : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 2025-26 విద్యా సంవత్సరానికి రెన్యువల్స్‌ కోసం ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపల్‌ పద్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం ఏప్రిల్‌ 30వతేదీలోపు పని చేసిన వారు ఇందుకు అర్హులన్నారు.

మహిళలపై 'గాలి' వ్యాఖ్యలు బాధాకరం

ఆత్మకూరు : మాజీ మంత్రి రోజాపై చిత్తూరు జిల్లా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఎంపిపి సుబ్బర హేమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉన్న భానుప్రకాష్‌ నిత్యం ప్రజాసేవలో ఉంటున్న రోజాపై జుగుప్సాకరమైన పదజాలం వాడటం క్షమించరానిదన్నారు. వెంటనే ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

బదిలీ పోలీసులకు సన్మానం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన పోలీసులను ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా హెడ్‌ కానిస్టేబుల్‌ బాల నరసింహులు, కానిస్టేబుల్‌ జనార్ధన్‌కు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ రామదాసు, హెడ్‌ కానిస్టేబుల్‌ శివశంకర్‌ నాయక్‌, మల్లికార్జున, పోలీసులు నాగరాజు, నాగభూషణ, శివ, గణేష్‌, వెంకటేష్‌ నాయక్‌, మోహన్‌ ,జయసుధ పోలీస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌ ఎన్నికల్లో మజ్దూర్‌ యూనియన్‌ ఘనవిజయం

గుంతకల్లు : రైల్వే ఇన్స్టిట్యూట్‌ ఎన్నికల్లో మజ్దూర్‌ యూనియన్‌ ప్యానెల్‌ ఘన విజయం సాధించింది. శుక్రవారం స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్‌లో రైల్వే మజ్దూర్‌ యూనియన్‌, ఎంప్లాయిస్‌ సంఘ్‌ ప్యానెల్‌ ఎన్నికల్లో పాల్గొన్నాయి. ఇన్స్టిట్యూట్‌లో 944 మంది ఓటర్లు ఉండగా 866 మంది సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. మజ్దూర్‌ యూనియన్‌ తరపున కార్యదర్శి స్థానానికి కె.ఎల్లప్ప జెండా గుర్తితోనూ, ఎంప్లాయిస్‌ సంఘ్‌ అభ్యర్థిగా మల్లికార్జున రైలు ఇంజన్‌ గుర్తుతో తమ తమ 9 మంది ప్యానెల్‌ సభ్యులతో పోటీలో పాల్గొన్నారు. పోలింగ్‌ ముగిసిన తర్వాత సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల్లో మజ్దూర్‌ యూనియన్‌ ప్యానెల్‌ కార్యదర్శి అభ్యర్థికి 457 ఓట్లు రాగా, ఎంప్లాయిస్‌ సంఘ్‌ అభ్యర్థిగా బరిలో ఉన్న మల్లికార్జున కు 401 ఓట్లు పోలైనాయి. 8 ఓట్లు విలువ లేనివిగా పోలైనాయి. దీంతో రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ ప్యానెల్‌ ఘనవిజయం సాధించింది. కె.మల్లయ్య రైల్వే ఇన్స్టిట్యూట్‌ కార్యదర్శిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో మజ్దూర్‌ యూనియన్‌ ప్యానెల్‌ సభ్యులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థుల పోస్ట్‌కార్డ్‌ ఉద్యమం

కళ్యాణదుర్గం రూరల్‌ : 'సేవ్‌ ఆర్‌డిటి-సేవ్‌ అనంత' నినాదం స్ఫూర్తితో శుక్రవారం కంబదూరులోని జడ్పీ హైస్కూల్‌, కెజిబివి విద్యార్థులు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఆర్‌డిటి అభిమాన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల చేత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఉత్తరాలు రాయించారు. ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంస్థ సిబిటిలు గోవిందు, నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగలగూడూరులో 'తొలిఅడుగు'

పుట్లూరు : మండలంలోని శనగలగూడూరు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటికి టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, ఎల్‌కె చెన్నారెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధనరాజు, బాలాపురం రామచంద్రారెడ్డి, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గూడూరు విజయ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మయ్య, శ్రీపతినాయుడు, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, రామచంద్ర నాయుడు, సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌, వేణు, డిసి ఓబుళనాయుడు, తిప్పారెడ్డి, రంగయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే ధ్యేయం

ఉరవకొండ : క్షయ వ్యాధి రహిత సమాజాన్ని రూపొందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌ హంపన్న తెలిపారు. టీబీ నివారణ సూపర్‌వైజర్‌ కుళ్లాయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో టిబి ముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ఆర్టీసీ సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నిరోధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కానిస్టేబుల్‌ రవీంద్ర, రామకోటి, సబ్‌ యూనిట్‌ అధికారి కోదండరామ్‌రెడ్డి, పట్టణ ఆరోగ్య కార్యకర్తలు వెంకటేష్‌ ప్రసాద్‌రావు, సుమలత, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి

అనంతపురం : పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటీ సేవల యథాతథంగా కొనసాగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎపియుడబ్ల్యుజె నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌ నుంచి కలెక్టరేట్‌ వరకూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్‌ ఎదురుగా ఉన్న ఫాదర్‌ ఫెర్రర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్‌ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.బాబు, స్టేట్‌ కౌన్సిల్‌ సభ్యులు కె.రామచంద్ర, చలపతి, కెపి.కుమార్‌, జీవీ, బాల రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, లోకరాజు, లింగప్రసాద్‌, లోకరాజు, ట్రెజరర్‌ చౌడప్ప, ససప రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు ఆర్థికసాయం

అనంతపురం క్రైం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనారోగ్యంతో మృతిచెందిన ముగ్గురు హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ పి..జగదీష్‌ శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆర్థికసాయం అందించారు. సత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు బి.తిరుపాల్‌ నాయక్‌, నరసింహులు కుటుంబాలు, అనంతపురం జిల్లాకు చెందిన లక్ష్మీరెడ్డి కుటుంబానికి పరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, రిజర్వ్‌ ఇన్స్‌పెక్టర్లు పవన్‌కుమార్‌, రాముడు, ఆర్‌ఎస్‌ఐ జాఫర్‌, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం

ఉరవకొండ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేద్దామని సర్పంచు మల్లెల జగదీష్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో అంగన్వాడీ సెంటర్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయ వెంకటేశులు, మహిళా సంరక్షణ కార్యదర్శి అరుణ, అంగన్వాడీ సిబ్బంది చంద్రమణి, సోమేశ్వరి, సరోజ, శశికళ, ఆయాలు వరలక్ష్మి, రాజేశ్వరి, నాగమ్మ, ప్రభావతి, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ శాఖ మంత్రిని కలిసిన తుల్జాపూర్‌ స్వప్న

అనంతపురం రూరల్‌ : జిల్లా పర్యటనకు వచ్చిన మున్సిపల్‌ శాఖ మంత్రి నారాయణను టిడిపి తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి తుల్జాపూర్‌ స్వప్న శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు.

గ్రామ సమాఖ్య రుణాలపై సామాజిక తనిఖీ

యల్లనూరు : మండలంలోని వెలుగు కార్యాలయంలో 2024-25కు సంబంధించిన గ్రామ సమాఖ్య సంఘాల రుణాలు, ఖర్చుల వివరాలపై సిసిటి కిషోర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాలలోని విఒల రికార్డులు, బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిసిటిలు, విఒలు పాల్గొన్నారు.

కేబుల్‌ వైర్‌ చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన రైతు 680 అడుగుల కేబుల్‌ వైరు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

యాడికి : ప్రమాదంలో గాయపడిన మండల పరిధిలోని కొనుప్పలపాడు గ్రామానికి చెందిన నబిరసూల్‌కు టిడిపి సీనియర్‌ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి శుక్రవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సింగిల్‌విండో అధ్యక్షులు చలమారెడ్డి, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, రామాంజనేయులు, మాజీ సర్పంచు రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

'తండా'కు బంగారు భవిష్యత్తు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

కేంద్ర నిధులతో మండల పరిధిలోని నాగులగుడ్డం తండాకు బంగారు భవిష్యత్తు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలోని తండాలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకం అందించాలని సూచించారు. గ్రామంలో తాగు, సాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై నివేదికను ఉన్నత అధికారులకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌ శేషారెడ్డి, ఎంపిడిఒ భాస్కర్‌, డిడబ్ల్యూహెచ్‌ఒ రామాంజనేయులు, టిడిపి నాయకులు పిఎల్‌ ఈశ్వర్‌రెడ్డి, మారుతీనాయుడు, దండు శ్రీనివాసులు, మాజీ సర్పంచు అట్టే రామాంజనేయులు, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్‌ ఆదినారాయణ, శింగనమల చెరువు రాయకట్టు ప్రెసిడెంట్‌ జి.సత్యనారాయణ, అనిల్‌కుమార్‌, కాయగూరల సత్తి, మసూద్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్‌ ఆదేశాలతో శుక్రవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురంతోపాటు జిల్లాలోని అన్ని మున్సిపల్‌ పట్టణాలు, మండల కేంద్రాలలోని కూడళ్ళు, జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని, సెల్‌ ఫోన్‌ డ్రైవింగ్‌, డ్రంకన్‌ డ్రైవ్‌ లకు దూరంగా ఉండాలని సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసుల చర్యలు తీసుకున్నారు. మైనర్ల వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని వివరించారు. అతివేగం, ట్రిపుల్‌ రైడింగ్‌, మైనర్‌ డ్రైవింగ్‌, ఓవర్‌లోడింగ్‌, డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌, సెల్‌ ఫోన్‌ డ్రైవింగ్‌, ఆటో సైడ్‌ సిట్టింగ్‌, డెఫెక్టివ్‌ నంబర్‌ ప్లేట్స్‌, అనధికార పార్కింగ్‌ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధించారు.

20న రాష్ట్రస్థాయి మాజీ సైనికుల జనరల్‌ బాడీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం


సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు

అనంతపురం నగరంలోని కృష్ణకళా మందిరంలో ఈనెల 20వ తేదీన రాష్ట్రస్థాయి మాజీ సైనికుల జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షులు పి.విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశంలో మాజీ సైనికుల సమస్యలపై చర్చించడమే కాకుండా, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమి, అర్హత కలిగిన మాజీ సైనికులకు ఉద్యోగావకాశాలు, ఇసిహెచ్‌ఎస్‌లో సమస్యలు, వితంతు పెన్షన్‌ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా సమస్యలపై ప్రభుత్వ అధికారులకు మెమొరాండం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఒ.రమేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రసాద్‌, మురళీ, నల్లపరెడ్డి, ముస్తఫా, జయచంద్ర, పెద్దారెడ్డి, మదార్‌, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఎఎంసి చైర్మన్‌గా జి.సూర్యప్రతాప్‌

ప్రజాశక్తి-గుత్తి


సూర్యప్రతాప్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గుత్తి వ్యవసాయ మార్కెట్‌ యార్డు చైర్మన్‌గా గుర్రాల సూర్యప్రతాప్‌ నియమితులయ్యారు. మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన జి.సూర్యప్రతాప్‌ టిడిపి కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. ఆయన చేసిన సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించింది. కాగా నూతన ఎఎంసి చైర్మన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సూర్యప్రతాప్‌ను పలువురు నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు ఎంకె.చౌదరి, ఎస్‌ బద్రీవలి, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్‌, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్‌ శీనా, బి.రమేష్‌, సర్పంచి యు.రామలింగమయ్య, నాయకులు జక్కలచెరువు గోవిందు, ఆర్‌.సోలమన్‌రాజ్‌, మండల నాగరాజు, కెబి రామకృష్ణ, ఎస్‌.ఇసాక్‌, వెంకటశివుడు, ఎం.రామకృష్ణ, చెట్నేపల్లి రమేష్‌, జి.సునీల్‌, న్యాయవాది సోము, తదితరులు పాల్గొన్నారు.